క్లుప్తంగా

నేడు అంగన్‌వాడీల ధర్నా

నల్లగొండ టూటౌన్ : అంగన్‌వాడీ ఉద్యోగులకు సమ్మె ఒప్పందాలను అమలు చేసి, జీఓ 10 వెంటనే రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి దండెంపల్లి సత్తయ్య ప్రభుత్వాన్ని కోరారు. శుక్రవారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అంగన్‌వాడీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని శనివారం కలెక్టర్ కార్యాలయం ఎదుట చేపట్టే ధర్నాకు అంగన్‌వాడీలు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు. సమావేశంలో అద్దంకి నర్సింహ, సైదాచారి, నగేష్ తదితరులు పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీలో సీట్లు సాధించిన విద్యార్థినులు

చిట్యాల: మండలంలోని నేరడ జెడ్పీహెచ్ఎస్‌కు చెందిన ఇద్దరు విద్యార్థినులు ఇటీవల విడుదల చేసిన బాసర ట్రిపుల్ ఐటీలో సీట్లు సాధించినట్లు ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జి.రామ్మోహన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతిలో 10 జీపీఏ సాధించిన పొట్టబత్తిని ఫణిశ్రీ, 9.8 జీపీఏ సాధించిన కొన్నె హన్సిక బాసర ట్రిపుల్ ఐటీలో సీట్లు సాధించారు.

ముందస్తు అరెస్ట్

చిట్యాల: నిరుద్యోగుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ డీవైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో చేపట్టనున్న ఆందోళన కార్యక్రమంలో పాల్గొనకుండా ఉండేందుకుగాను మండలానికి చెందిన పలువురు నాయకులను శుక్రవారం చిట్యాల పోలీసులు ముందస్తుగా అరెస్ట్ చేశారు. అనంతరం వారిని వ్యక్తిగత పూచీకత్తుపై విడుదల చేశారు. అరెస్టయినవారిలో జిట్ట రమేష్, సాయికిరణ్, ప్రణీత్ ఉన్నారు.

వానరానికి అంత్యక్రియలు

చిట్యాల: మండలంలోని నేరడ గ్రామంలో శుక్రవారం ఓ వానరం ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై మృతి చెందింది. గుర్తించిన గ్రామస్తులు గ్రామ పంచాయతీ సిబ్బంది సహకారంతో ఆ వానరానికి అంత్యక్రియలు నిర్వహించారు. కల్లూరి శత్రుజ్ఞగౌడ్, గంజి దశరథ, జనార్దన్, నర్సింహాచారి, ఐతరాజు నర్సింహ, ముశం శ్రీనివాస్ పాల్గొన్నారు.

మార్క్‌ఫెడ్ చైర్మన్‌ను కలిసిన డీసీఎంఎస్ చైర్మన్



వెంకట్‌రెడ్డిని సన్మానిస్తున్న మార్క్‌ఫెడ్ చైర్మన్

నల్లగొండ టౌన్ : మార్క్‌ఫెడ్ చైర్మన్ మార గంగారెడ్డిని శుక్రవారం హైదరాబాద్‌లో నల్లగొండ నాగార్జున సహకార మార్కెటింగ్ సంఘం (డీసీఎంఎస్) చైర్మన్ బొళ్ల వెంకట్‌రెడ్డి కలిశారు. నూతనంగా చైర్మన్‌గా ఎన్నికైన వెంకట్‌రెడ్డిని మార్క్‌ఫెడ్ చైర్మన్ శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ బిజినెస్ మేనేజర్ నాగిళ్ల మురళి పాల్గొన్నారు.

7న ఎమ్మార్పీఎస్ దినోత్సవం

చిట్యాల: ఎమ్మార్పీఎస్ 30వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఈ నెల 7వ తేదీన ఘనంగా నిర్వహించనున్నట్లు నకిరేకల్ నియోజకవర్గ ఎమ్మార్పీఎస్ ఇన్‌చార్జ్ మేడి శంకర్‌మాదిగ తెలిపారు. చిట్యాలలో శుక్రవారం జరిగిన ఎమ్మార్పీఎస్ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సమావేశంలో ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధానకార్యదర్శి ఎరసాని గోపాల్, జిల్లా కార్యదర్శి పెరిక లింగస్వామి, నోముల పురుషోత్తం, రుద్రవరం లింగస్వామి, నందిపాటి సురేష్, మేడి అర్జున్ పాల్గొన్నారు.

నోట్ పుస్తకాల పంపిణీ




నోట్ పుస్తకాలతో విద్యార్థులు

మర్రిగూడ: మండల కేంద్రంలోని హైస్కూల్‌లో 30 మంది విద్యార్థులకు ఆ పాఠశాల హిందీ పండిట్ మాస బాలరాజు శుక్రవారం నోట్ పుస్తకాలు పంపిణీ చేశారు. హెచ్ఎం డి.బుచ్చయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గ్యాస్ సిలిండర్లు అందజేత

శాలిగౌరారం: మండలంలోని వల్లాల ప్రభుత్వ మోడల్‌స్కూల్ హాస్టల్‌కు రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఆర్థిక సహాయంతో కొనుగోలు చేసిన గ్యాస్ సిలిండర్లు, గ్యాస్ పొయ్యిలను శుక్రవారం కాంగ్రెస్ నాయకులు అందజేశారు. గత నెల 15న బడిబాట కార్యక్రమంలో భాగంగా మోడల్‌స్కూల్‌కు వచ్చిన మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని హాస్టల్ వంట మనుషులు హాస్టల్‌కు గ్యాస్ కనెక్షన్లు, గ్యాస్‌పొయ్యిలను ఇప్పించాలని వేడుకున్నారు. స్పందించిన మంత్రి స్థానిక నాయకుల ద్వారా రూ.2.50 లక్షల సామగ్రి అందించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కందాల సమరంరెడ్డి, షేక్ ఇంతియాజ్, చింత ధనుంజయ్య, వెంకటయ్య, మల్లయ్య, రామలింగయ్య, నరేశ్, మహేశ్, రవీందర్‌రెడ్డి, మోడల్‌స్కూల్ ప్రిన్సిపాల్ రాగిణి పాల్గొన్నారు.




గ్యాస్ సిలిండర్లు, పొయ్యిలు అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

వివాదాస్పదంగా 'మెప్మా' పనితీరు

- మున్సిపల్ పాలకవర్గానికి, కమిషనర్‌కు తెలియకుండా సిబ్బంది నిర్ణయాలు
- ప్రభుత్వం నుంచి వచ్చే సమాచారమంతా గోప్యం
- సిబ్బందిని సరెండర్ చేయాలని అదనపు కలెక్టర్‌కు లేఖ

నల్లగొండ టూటౌన్ : పట్టణంలో పొదుపు సంఘాల ఏర్పాటుతోపాటు వారికి బ్యాంకుల ద్వారా రుణాలు ఇప్పించి ఆర్థికాభివృద్ధికి తోడ్పాటు అందించడం, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టే పథకాలపై మెప్మా (పట్టణ పేదరిక నిర్మూలనా సంస్థ) సిబ్బంది అవగాహన కల్పించాల్సి ఉంటుంది. కానీ నీలగిరి మున్సిపల్ కార్యాలయంలోని మెప్మాలో పనిచేస్తున్న కొందరు సిబ్బంది తీరు తరచూ వివాదాస్పదంగా మారుతోంది. సంబంధిత విభాగాన్ని చక్కబెట్టాల్సిన ఉద్యోగి సైతం తమకేమీ తెలియదంటూ దాటవేత వైఖరి అవలంభిస్తున్నారు. అన్ని వివరాలను గుట్టుగా ఉంచడం, మెప్మా విభాగానికి చెందిన కీలక సమాచారం కూడా మున్సిపల్ కమిషనర్‌కు తెలియపర్చకపోవడంపై పాలకవర్గం సీరియస్‌గా తీసుకుంది. కేంద్రానికి సంబంధించి 18 రకాల పథకాలు ఉన్నా మహిళలకు గానీ, పాలకవర్గ సభ్యులకు గానీ సమాచారం ఇవ్వకుండా గోప్యంగా ఉంచడంలో ఆంతర్యమేంటనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి.



పొదుపు సంఘాల మహిళల నుంచి డబ్బులు వసూలు

మెప్మా విభాగంలో పనిచేసే సిబ్బందిని సమన్వయపర్చాల్సిన టీఎంసీ ప్రభుత్వ పథకాలకు సంబంధించిన వివరాలను రహస్యంగా ఎందుకు ఉంచుతున్నారనే మున్సిపల్ కమిషనర్ ప్రశ్నలకు సమాధానాలు చెప్పలేక నీళ్లు నములుతున్నట్లు తెలిసింది. అమృత్ స్కీం కింద పార్కుల నిర్వహణ కోసం పొదుపు సంఘాల మహిళల ఎంపిక వివరాలు కూడా మున్సిపల్ అధికారులకు తెలియకుండా యంత్రాంగం నడపడంపై తీవ్ర విమర్శలు వచ్చాయి. ప్రభుత్వ నిబంధనలను తుంగలో తొక్కి సంబంధిత సిబ్బంది తమకు నచ్చిన వారిని ఎంపిక చేశారు. పార్లమెంట్ ఎన్నికల ముందే వీరి తీరుపై ఉన్నతాధికారులకు ఫిర్యాదులు వెళ్లినట్లు చర్చ జరిగింది. విధుల పట్ల నిర్లక్ష్యం, అధికారులకు, కౌన్సిల్‌కు సమాచారం ఇవ్వకుండా అంతా ఇష్టం వచ్చినట్లు వ్యవహరిస్తారా అంటూ పాలకవర్గం గుర్రుగా ఉంది. అదేవిధంగా పొదుపు సంఘాల మహిళలు రుణాలు తీసుకున్నప్పుడు వారినుంచి ముక్కు పిండి డబ్బులు వసూలు చేస్తున్నారనే ఫిర్యాదులు వచ్చాయి. గతంలో ఒక సంఘానికి చెందిన ఒక్కొక్కరి నుంచి రూ.10 వేలు వసూలు చేసినట్లు అధికారుల విచారణలో కూడా బయటపడింది. ఇలా మెప్మా సిబ్బంది తెర వెనుక ఉండి ఆర్పీలతో వసూళ్లకు పాల్పడుతున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సుదీర్ఘకాలంగా ఇక్కడే పనిచేస్తున్నందున మెప్మా టీఎంసీ, ఇతర సీఓలను సరెండర్ చేసి ఇతర సిబ్బందిని కేటాయించాలని మున్సిపల్ అధికారులు అదనపు కలెక్టర్‌కు లేఖ రాశారు.

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదు



మెప్మా సిబ్బంది విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే సహించేదిలేదు. సిబ్బంది పనితీరు మార్చుకోవాలని గతంలోనే హెచ్చరించాం. ప్రభుత్వ పథకాలను ప్రజలకు చెప్పాల్సిన బాధ్యత ఉద్యోగులపై ఉంటుంది. సమాచారం ఇవ్వకపోవడం సరైందికాదు.

– సయ్యద్ ముసాబ్ అహ్మద్, మున్సిపల్ కమిషనర్

ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాల సంఖ్య పెంచాలి

- కలెక్టర్ నారాయణరెడ్డి

నల్లగొండ టూటౌన్ : జిల్లాలోని ప్రభుత్వ ఆస్పత్రుల్లో సాధారణ ప్రసవాల సంఖ్య పెంచాలని కలెక్టర్ సి.నారాయణరెడ్డి అన్నారు. శుక్రవారం నల్లగొండ పట్టణంలోని పానగల్ రోడ్‌లో ఉన్న ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆస్పత్రిలోని మందులు, వైద్యులు, సిబ్బంది హాజరు రిజిస్టర్‌ను పరిశీలించారు. ఔట్ పేషెంట్, ఇన్ పేషెంట్ల రిజిస్టర్లు, మందుల స్టాక్ రిజిస్టర్ పరిశీలించి వైద్యులతో మాట్లాడారు. సాధారణ ప్రసవాల సంఖ్య పెంచడంతోపాటు ప్రతి గర్భిణి పేరు ఆస్పత్రిలో నమోదు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఆస్పత్రి పరిసరాల్లో చెత్తాచెదారం, పిచ్చి మొక్కలను తొలగించాలని ఆదేశించారు. ఆస్పత్రి ఎదుట ఓపెన్ డ్రెయినేజీ వల్ల ఇబ్బందులు వస్తున్నాయని ఈ సందర్భంగా స్థానికులు కలెక్టర్ దృష్టికి తీసుకుపోయారు. స్పందించిన కలెక్టర్ డ్రెయినేజీలో చెత్త, చెదారం లేకుండా శుభ్రం చేయాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, సంస్థల్లో గత రెండు రోజులగా పరిశుభ్రత కార్యక్రమాన్ని చేపట్టారని తెలిపారు. కలెక్టర్ వెంట జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కళ్యాణ్ చక్రవర్తి, డిప్యూటీ డీఎంహెచ్ఓ వేణుగోపాల్‌రెడ్డి, ఆస్పత్రి డాక్టర్ రూషిక, భిక్షం ఉన్నారు.



ప్రభుత్వ ఆస్పత్రిలో మందులను పరిశీలిస్తున్న కలెక్టర్ నారాయణరెడ్డి

బెల్టు దుకాణాలు కొనసాగిస్తే కేసులు



కొరటికల్ గ్రామస్తులకు సూచనలు ఇస్తున్న సీఐ వెంకటయ్య

మునుగోడు: గ్రామాల్లో బెల్టు దుకాణాల ద్వారా మద్యం విక్రయాలు కొనసాగిస్తే కేసులు తప్పవని చండూరు సీఐ వెంకటయ్య హెచ్చరించారు. శుక్రవారం మునుగోడు, చండూరు, గట్టుప్పల్ ఎస్ఐలతోపాటు సిబ్బందితో కలిసి కొరటికల్ గ్రామంలోని బెల్టు దుకాణాల నిర్వాహకుల ఇళ్లల్లో సోదాలు చేశారు. ఒకరి ఇంట్లో 5 లీటర్ల మద్యం పట్టుబడగా ఇంటి యజమానిపై కేసు నమోదుచేశామని సీఐ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మద్యం సేవించడం, మత్తు పదార్థాలు తీసుకోవడం వల్ల అనారోగ్యానికి గురవుతారన్నారు. అంతేకాకుండా విచక్షణ కోల్పోయి ఇష్టానుసారంగా వ్యవహరించి నేరాలుచేసే అవకాశం ఉంటుందన్నారు. ఎవరైనా మద్యం విక్రయిస్తే వెంటనే తమకు సమాచారం అందించాలని, సమాచారం ఇచ్చినవారి పేర్లు గోప్యంగా ఉంచుతామన్నారు. కార్యక్రమంలో మునుగోడు, చండూరు, గట్టుప్పల్ ఎస్ఐలు వెంకటేశ్వర్లు, సురేష్, వెంకట్‌రెడ్డి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

గోపాలమిత్ర కుటుంబానికి ఆర్థికసాయం

నల్లగొండ టూటౌన్ : దేవరకొండ క్లస్టర్ పరిధిలోని ఖానాపూర్ గోపాలమిత్ర పల్లె వెంకటయ్య ఇటీవల మృతి చెందాడు. దీంతో గోపాలమిత్ర సర్వీస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పల్లె వెంకటయ్య కుటుంబ సభ్యులకు శుక్రవారం రూ.60 వేల ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఎల్లంల శంబులింగం యాదవ్ మాట్లాడుతూ జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో గోపాలమిత్రలకు ఎలాంటి ఇబ్బందులు ఎదురయినా పోరాడుతామని తెలిపారు. గోపాలమిత్రల సమస్యలు పరిష్కరించేందుకు ప్రభుత్వం దృష్టికి తీసుకుపోతామన్నారు. ఈ కార్యక్రమంలో కావటి యాదయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి నాగయ్య, యాదగిరి, సురేష్, మల్లేష్, లింగారెడ్డి, వెంకటేశ్, వెంకన్న, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

కనీస మద్దతు ధర చట్టం చేయాలి

నల్లగొండ టూటౌన్ : రైతులు పండించిన పంటలకు పార్లమెంట్‌లో కనీస మద్దతు ధర చట్టం చేయాలని రైతు సంఘం రాష్ట్ర నాయకుడు ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం రైతు సంఘం ఆధ్వర్యంలో స్థానిక సుభాష్ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం గత పదేళ్లలో రైతు వ్యతిరేక చట్టాలు తెచ్చిందని ఆరోపించారు. వ్యవసాయాన్ని సంక్షోభంలో నెట్టేయడానికి కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తోందన్నారు. రైతు సంఘాలు ఢిల్లీలో పోరాటం చేసినప్పుడు మోదీ ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలన్నారు. రూ.2లక్షల రుణమాఫీ చేసి, రైతు భరోసా రైతులతోపాటు కౌలు రైతులకు ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బండ శ్రీశైలం, కుంభం కృష్ణారెడ్డి, నన్నూరి వెంకటరమణారెడ్డి, ఎండీ.సలీం, వి.నారాయణరెడ్డి, రాములు, బుచ్చిరెడ్డి, అశోక్‌రెడ్డి, మల్లం అశోక్ తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

మర్రిగూడ : మండల కేంద్రంలోని ఎస్సీ వసతి గృహంలో అడ్మిషన్లకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు వసతి గృహ వార్డెన్ లింగయ్య శుక్రవారం తెలిపారు. వసతి గృహంలో ప్రభుత్వం అన్నిరకాల మౌలిక వసతులు కల్పిస్తోందన్నారు. విద్యార్థులు వసతి గృహాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇతర వివరాలకు 9441064926 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

కాంగ్రెస్ అంటేనే అవినీతికి మారుపేరు

- మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్

నల్లగొండ టూటౌన్: కాంగ్రెస్ పాలన అంటేనే అవినీతికి మారు పేరని, రాష్ట్రంలో మంత్రుల అనుచరులే ఇసుక దందా చేస్తున్నా పట్టించుకోవడం లేదని మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్ ఆరోపించారు. శుక్రవారం నల్లగొండలోని బీజేపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో ఇద్దరు మంత్రులు ఉన్నా ఏమాత్రం పట్టించుకోవడం లేదని, గత పదేళ్లది ఇప్పుడే సంపాదించుకోవడానికి అత్యాశకు పోతున్నారని విమర్శించారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వంపై బీజేపీ పోరాడుతుందన్నారు. ఆరు గ్యారంటీలు అమలు చేస్తామని చెప్పిన సీఎం రేవంత్‌రెడ్డి హామీలను గంగలో తొక్కాడన్నారు. సొంతంగా ఏ నిర్ణయాలు తీసుకోకుండా ఢిల్లీకి పోయి పర్మిషన్ తీసుకుంటున్నాడని ఎద్దేవా చేశారు. నిరుద్యోగులకు మద్దతుగా బీజేవైఎం మహాధర్నా చేస్తుంటే పోలీసులతో అరెస్ట్ చేయించడం సిగ్గుచేటన్నారు. బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గంగిడి మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ.. ఎస్ఎల్‌బీసీ సొరంగాన్ని వెంటనే పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రాజెక్టు పూర్తి చేయకుండా జిల్లా ప్రజలను మోసం చేసిందన్నారు. గత ప్రభుత్వం చేపట్టిన పనులు అన్ని నిలిచిపోయాయని, పెండింగ్ పనులు పూర్తి చేసేందుకు మంత్రులు శ్రద్ధ పెట్టాలన్నారు. మనకు రావాల్సిన కృష్ణాజలాల వాటా వచ్చేలా రాష్ట్ర మంత్రులు చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ నాగం వర్షిత్‌రెడ్డి, సీనియర్ నేత చింతల రామచంద్రారెడ్డి, పాపారావు, ఎరెడ్ల శ్రీనివాస్‌రెడ్డి, వీరెల్లి చంద్రశేఖర్, పోతెపాక లింగస్వామి, గోలి ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.



పవర్‌లూమ్స్‌ను పరిశీలిస్తున్న బూర నర్సయ్యగౌడ్, బీజేపీ నాయకులు

ప్రతిఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలి

ప్రతి ఒక్కరూ తమ బాధ్యతగా మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్ అన్నారు. శుక్రవారం నల్లగొండ పట్టణంలోని పద్మనగర్ కాలనీలో పవర్‌లూమ్స్‌ను ఆయన పరిశీలించారు. అనంతరం స్థానికంగా మొక్కలు నాటి నీళ్లు పోశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యత అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గంగిడి మనోహర్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి, స్థానిక కౌన్సిలర్ గుర్రం ధనలక్ష్మీవెంకన్న, వీరెల్లి చంద్రశేఖర్, మిర్యాల వెంకటేశం, పోతెపాక లింగస్వామి పాల్గొన్నారు.

కొత్త చట్టాలపై ప్రజలకు అవగాహన

నకిరేకల్ : కొత్త చట్టాలపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని నకిరేకల్ సీఐ రాజశేఖర్, ఎస్ఐ గోపి కృష్ణ అన్నారు. ఎస్పీ ఆదేశాల మేరకు నకిరేకల్ మండలం చందంపల్లి గ్రామంలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కళాజాతా కార్యక్రమంలో వారు మాట్లాడారు. రోడ్డు ప్రమాదాల నివారణ, గంజాయి, మత్తు పదార్థాల నివారణ, సైబర్ నేరాల పట్ల అప్రమత్తత, దొంగతనాల నివారణకు ప్రజల్లో అవగాహన కల్పించేందుకు పోలీస్ కళాబృందాల ఆధ్వర్యంలో అవగాహన కల్పిస్తున్నామన్నారు. గ్రామాల్లో అనుమానాస్పద వ్యక్తులు కనిపించిన వెంటనే 100 నంబర్‌కు ఫోన్ చేసి పోలీసులకు తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో పోలీస్ కళాకారుల బృందం షేక్ హుస్సేన్, శేఖర్, పురుషోత్తం, సత్యం, మురళి తదితరులు పాల్గొన్నారు.

నల్లగొండ క్రైం : ఇసుక అక్రమ రవాణకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని నల్లగొండ రూరల్ ఎస్ఐ జె.శివకుమార్, తహసీల్దార్ శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం మండలంలోని నర్సింగ్‌బట్ల గ్రామంలో ఇసుక పాలసీ, కొత్త చట్టాలపై అవగాహన కల్పించారు. అనుమతి లేకుండా ఇసుక రవాణా చేయవద్దని, ట్రాక్టర్లకు రేడియం స్టిక్కర్లు వేయించాలని, సౌండ్ బాక్సులు పెట్టవద్దని, అతివేగంగా వాహనాలు నడపవద్దని, నంబర్ ప్లేట్ స్పష్టంగా ఉండాలని, మైనర్లకు వాహనాలు ఇవ్వకూడదని సూచించారు. ఈ కార్యక్రమంలో మైనింగ్ ఎస్ఆర్ఓ శివ, కార్యదర్శులు మధుసూదన్‌రెడ్డి, సాయి, ప్రజ్ఞ తదితరులు పాల్గొన్నారు.



నకిరేకల్ : చందంపల్లి గ్రామంలో అవగాహన కల్పిస్తున్న కళాబృందం సభ్యులు

'పారిశుద్ధ్య చర్యలు లేకపోవడంతో దోమల వ్యాప్తి'

నల్లగొండ టౌన్ : నల్లగొండ పట్టణంలో పారిశుద్ధ్య చర్యలు సక్రమంగా లేకపోవడం వల్ల దోమల వ్యాప్తి పెరిగిందని సీపీఎం పట్టణ కమిటీ కార్యదర్శి ఎండీ.సలీం, జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు సయ్యద్ హాషం అన్నారు. శుక్రవారం స్థానిక దొడ్డి కొమురయ్య భవన్‌లో జరిగిన సీపీఎం పట్టణ కమిటీ సమావేశంలో వారు మాట్లాడారు. సీజనల్ వ్యాధులను నివారించడానికి అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో దండెంపల్లి సత్తయ్య, తుమ్మల పద్మ, కుంభం కృష్ణారెడ్డి, అద్దంకి నర్సింహ పాల్గొన్నారు.

కాలుష్య నియంత్రణ అధికారులకు ఫిర్యాదు

చిట్యాల: మండలంలోని పిట్టంపల్లి, వెలిమినేడు గ్రామాల పరిధిలో కాలుష్య కారక పరిశ్రమలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ మండలంలోని పిట్టంపల్లి గ్రామానికి చెందిన పర్యావరణ పరిరక్షణ సంస్థ సభ్యులు శుక్రవారం జిల్లా కాలుష్య నియంత్రణ మండలి అధికారులకు ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు లింగారెడ్డి, ప్రధాన కార్యదర్శి లింగస్వామిగౌడ్, సహాయ కార్యదర్శి శ్రవణ్ తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎంపీటీసీకి సన్మానం

చిట్యాల: ఐదేళ్ల పదవీ కాలాన్ని పూర్తి చేసుకున్న గుండ్రాంపల్లి గ్రామానికి చెందిన ఎంపీటీసీ సభ్యురాలు దుబ్బ పద్మకుమార్‌ను శుక్రవారం ఆ గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నమ్ముల విజయ్‌కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ బండల కృష్ణయ్య, తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటిన విద్యార్థులు

నార్కట్‌పల్లి : మండలంలోని ఏపీ లింగోటం హైస్కూల్‌లో శుక్రవారం క్లీన్‌హోం గ్రీన్‌హోం ఆర్గనైజర్ ఆదిమల్ల మనిరాజు ఆధ్వర్యంలో విద్యార్థులతో మొక్కలు నాటించారు. ప్రధానోపాధ్యాయుడు కాశయ్య, ఉపాధ్యాయులు రమేష్, ఎప్సిబా, వినోద, పద్మావతి, సత్యనారాయణ, హరివర్ధన్ రెడ్డి, భాస్కర్, రమణారెడ్డి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆంజనేయస్వామి ఆలయంలో కాలభైరవ అభిషేకం



పూజలు నిర్వహిస్తున్న భక్తులు

రామగిరి(నల్లగొండ): పట్టణంలోని తులసీనగర్ భక్తాంజనేయ స్వామి ఆలయంలో శుక్రవారం కాలభైరవ అభిషేకం నిర్వహించారు. అమావాస్య సందర్భంగా కాలభైరవ విగ్రహానికి ప్రత్యేక పంచామృతాభిషేకాలు, అరిసెల నివేదన పూజలు చేశారు. ఆలయ అర్చకులు హరీష్, సామ ప్రభాకర్‌రెడ్డి, శిరీష్, ప్రవీణ్, శ్రవణ్, చొకారపు వెంకన్న కారింగు శ్రీనివాస్, సహజ్, అర్జున్, ఆలంపల్లి శేఖర్, ధారా వెంకట్, శ్రీదేవి, మహేశ్వరి పాల్గొన్నారు.

ఎద్దును చంపిన గుర్తుతెలియని వ్యక్తులు

నార్కట్‌పల్లి : పొలం వద్ద కట్టేసిన ఓ ఎద్దును గుర్తుతెలియని వ్యక్తులు తాళ్లతో ఊపిరి ఆడకుండా బిగించడంతో మృతి చెందింది. ఈ ఘటన మండలంలోని ఏనుగులదోరి గ్రామంలో శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసులు, బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన మహేశ్వరం సుధాకర్ భూమిని కౌలుకు తీసుకోని వ్యవసాయం చేస్తున్నాడు. పొలం వద్ద తన ఎద్దులను రోజువారీగా చెట్టుకు కట్టేసి ఇంటికి వచ్చాడు. తిరిగి శుక్రవారం ఉదయం పొలం వద్దకు వెళ్లిన రైతు ఎద్దు మృతి చెంది ఉండడాన్ని గమనించాడు. కట్టేసిన చోటే అవే తాళ్లతో ఊపిరిఆడకుండా బిగించి, తోకను సైతం గుంజకు కట్టేసి గుర్తుతెలియని వ్యక్తులు చంపారని బాధిత రైతు సుధాకర్ వాపోయాడు. ఎద్దు విలువ రూ.50వేలు ఉంటుందన్నారు. ఈ విషయాన్ని పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఎస్ఐ ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. వెటర్నరీ డాక్టర్ రవినాయక్ ఎద్దుకు పోస్టుమార్టం చేయడంతో ఎస్ఐ సురేష్ కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రైతు భరోసా నిధులు విడుదల చేయాలి

కట్టంగూర్ : రైతు భరోసా నిధులు వెంటనే విడుదల చేయాలని కోరుతూ బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు పాదూరి వెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో కిసాన్‌మోర్చా నాయకులు శుక్రవారం తహసీల్దార్ గుగులోతు ప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్ ప్రారంభమై నెలరోజులు కావొస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం రైతు భరోసా ఇవ్వకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. జిల్లాలో ఇసుక అక్రమ రవాణా అరికట్టి భూగర్భ జలాలను కాపాడాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు పబ్బు వెంకన్న, మండల వెంకన్న, కిసాన్‌మోర్చా మండల అధ్యక్షుడు దేవరబోయిన వెంకన్న, బీజేపీ ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు గోలి ప్రభాకర్, కోమటి భాస్కర్, గున్నాల నాగరాజు, ముడుసు భిక్షపతి, సిద్దగోని మల్లికార్జున్, నీలం నాగరాజు, మారం శేఖర్, నర్సింహ పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

మర్రిగూడ : వర్షాకాలంలో సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు నిత్యం అప్రమత్తంగా ఉండాలని మండల మెడికల్ అధికారి దీపక్ సూచించారు. సీజనల్ వ్యాధులు రాకుండా తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలపై శుక్రవారం మండలంలోని వట్టిపల్లిలో గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎక్కువ కాలం నీరు నిల్వ ఉండడం వల్ల దోమలు వ్యాపించి డెంగ్యూ, మలేరియా వంటి రోగాలు వస్తాయని తెలిపారు. ఇళ్లల్లో, ఇంటి ఆవరణలో నిల్వ నీటిని తొలగించాలని సూచించారు. అనంతరం వీధులను శుభ్రం చేయించి బ్లీచింగ్ చల్లించారు. కార్యక్రమంలో సీహెచ్ఓ సుజాత, హెచ్ఈఓ విజయ్‌ప్రసాద్, పీహెచ్ఎన్ కమల, సూపర్‌వైజర్ విజయమ్మ తదితరులు పాల్గొన్నారు.

శ్యామప్రసాద్ ముఖర్జీ దివస్

చండూరు : డాక్టర్ శ్యామప్రసాద్ ముఖర్జీ బలిదాన్ దివస్ పక్షోత్సవాలను పురస్కరించుకొని శుక్రవారం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రి ఆవరణలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు పందుల సత్యంగౌడ్ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు సోమ నరసింహ, వెంకటేశ్వర్లు, శ్రీహరి, సోమశంకర్, స్వామి, ఆంజనేయులు, శ్రీకాంత్, శివ, నరేష్, శేఖర్, రామకృష్ణ, మల్లేష్, వేణు పాల్గొన్నారు.



మొక్క నాటుతున్న బీజేపీ నాయకులు

ఇసుక, మట్టి అక్రమ రవాణాపై నిఘా!

- అనుమతి లేకుండా తరలిస్తే కేసు నమోదు
- మూడుమార్లు పట్టుబడితే కోర్టుకు అప్పగింత
- వాహనాల యజమానులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

మునుగోడు: గ్రామాల్లోని వాగులు, చెరువులు, కుంటల నుంచి ఎవరైనా అక్రమంగా ఇసుక, మట్టిని తలిస్తే ఇక జైలుకు వెళ్లక తప్పదు. ఇప్పటి వరకు అక్రమ రవాణాను పట్టించుకోని సంబంధిత అధికారులు 10 రోజులుగా ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారు. గతంలో పోలీసులు మాత్రమే అక్రమ రవాణాను అడ్డుకునేందుకు నిఘా పెట్టి పట్టుబడిన వారిపై కేసులు నమోదు చేయడం లేదా తహసీల్దార్, మైనింగ్ కార్యాలయాల్లో జరిమానాలు కట్టించి వదిలేసేవాళ్లు. ఇకనుంచి అలాకాకుండా అధికారుల అనుమతి లేకుండా ట్రాక్టర్ లేదా ఇతర వాహనాల్లో ఇసుక, మట్టి తరలిస్తే కఠిన చర్యలు తీసుకునేలా ప్రణాళిక సిద్ధం చేశారు.

అన్నిశాఖ అధికారులతో అవగాహన సదస్సులు

ఇసుక, మట్టితోపాటు ఇతర అక్రమ వ్యాపారాలపై సంబంధిత అధికారులు, వివిధ శాఖల అధికారులు నిఘాపెట్టి అక్రమ రవాణాను పూర్తిగా నివారించాలని వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఇటీవల కలెక్టర్, ఎస్పీ ఆదేశాలు జారీ చేశారు. వాహనాల యజమానులతోపాటు గ్రామాల్లోని ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. దీంతో మండలంలోని పోలీసులు, తహసీల్దార్, పంచాయతీరాజ్, చిన్న నీటిపారుదల, మైనింగ్ అధికారులు గ్రామాల్లో అవగాహన సదస్సులు నిర్వహించి అక్రమ రవాణా నిలిపివేయాలని సూచిస్తున్నారు. సాండ్ ట్యాక్సీ ద్వారా ఇసుక రవాణాచేసే ట్రాక్టర్ యజమానులు ఫోన్ మెసేజ్ కాకుండా ఎస్ఆర్ఓ వద్ద స్లిప్ తీసుకుని రోడ్డుపైకి రావాలని ఆదేశిస్తున్నారు.



కొరటికల్ గ్రామంలో అవగాహన కల్పిస్తున్న అధికారులు (ఫైల్)

అక్రమ వ్యాపారులపై కేసు

అక్రమంగా ఇసుక, మట్టి తరలిస్తూ ఒకటి, రెండు మార్లు పట్టుబడితే ఆ వాహనానికి రెవెన్యూ, మైనింగ్, కోర్టుల ద్వారా జరిమానా విధించి వదిలేస్తారు. మూడోమారు పట్టుబడితే ఇక ఆ వాహనంపై జీవో నం 59 ప్రకారం కేసు నమోదు చేసి కోర్టుకు అప్పగిస్తే ఆ వాహనం తిరిగి రిలీజ్ చేసే అవకాశం లేకుండా చట్టం చేశారు. అంతేకాకుండా అక్రమ వ్యాపారులపై పీడీపీపీ యాక్టు (ప్రైవేటు డ్యామేజ్ ఆఫ్ పబ్లిక్ ప్రాపర్టీ) కింద కేసు నమోదు చేయడంతోపాటు ఐపీసీ 379 సెక్షన్ ప్రకారం కేసులు నమోదు చేయనున్నారు. ఈ విషయాలన్నింటిని గ్రామాల్లోని వాహన యజమానులతోపాటు ప్రజలకు అధికారులు వివరిస్తున్నారు. ఇసుక, మట్టి అవసరమైనవారు సంబంధిత అధికారులకు దరఖాస్తు చేసుకుంటే వాటి పరిమాణాన్ని బట్టి ప్రభుత్వానికి కొంత రుసుము కట్టించుకునే అవకాశం కల్పించారు. నిబంధనలు పాటించకుండా ఎవరైనా అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు తప్పవని అధికారులు హెచ్చరిస్తున్నారు.



ఇటీవల ఇసుక అక్రమ రవాణా చేస్తూ పట్టుబడిన ట్రాక్టర్లు (ఫైల్)

నిబంధనలు పాటించకుంటే వాహనాన్ని సీజ్ చేస్తాం



వాగులు, చెరువుల నుంచి అధికారుల అనుమతి లేకుండా ఇసుక, మట్టి రవాణా చేస్తే వారిపై కేసులు నమోదు చేసి జైలుకు పంపుతాం. ప్రతి వాహనదారుడు ప్రభుత్వ అధికారుల అనుమతితోనే రవాణా చేయాలి. ఎవరైనా నిబంధనలు పాటించకుంటే జీవో నం 59 ప్రకారం వాహనాన్ని సీజ్ చేసి కోర్టుకు అప్పగిస్తాం. మూడు, నాలుగుమార్లు పట్టుబడినవారిపై పీడీపీపీ యాక్టు ప్రకారం కేసు నమోదు చేస్తాం.

– సీహెచ్.వెంకటేశ్వర్లు, ఎస్ఐ మునుగోడు